క్లుప్తంగా

గర్భిణులకు సామూహిక సీమంతాలు



నర్సింగపురంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న అధికారులు

పిఠాపురం: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి సూచించారు. మండలంలోని నర్సింగపురం భీం నగర్‌లో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి ఉలవల భూషణం ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులకు చీర, పౌష్టికాహారం అందించి సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గర్భిణులు వైద్యుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు ఉచితంగా అందించడంతో పాటు తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఓలేటి పాపిరెడ్డి, రాజ్ కుమార్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు శ్రీదేవి, విజయశాంతి తదితరులు పాల్గొన్నారు.

జనభాగీదారిపై అవగాహన



పిల్లల తల్లికు జన భాగీదారిపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం శివారు కాశివారిపాకలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జన భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లల తల్లులకు పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించారు. పిల్లల జీవితంలో మొదటి 6 సంవత్సరాలు ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది వెంకటదుర్గా, కరుణ, సుధామాధురి తదితరులు పాల్గొన్నారు.


జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



పాత ఇసుకపల్లిలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విద్యతోనే పేదరికం దూరమవుతుందని సచివాలయాల గ్రామ కన్వీనర్ ఎరకం దివాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరుగుతోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసిన ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: జెడ్పీటీసీ సభ్యులు చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ఈటీసీ ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యుల నాలుగో బ్యాచ్‌కు బుధవారంతో శిక్షణ ముగిసింది. జెడ్పీటీసీల హక్కులు, బాధ్యతలు, విధులపై శిక్షణ ఇచ్చినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు జెడ్పీటీసీ సభ్యుల నుంచి శిక్షణపై అభిప్రాయాలను సేకరించి, అనంతరం సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు శిక్షణలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, కేఆర్ నిహారిక పాల్గొన్నారు.

నిప్పుల కుంపటి

పిఠాపురం: ప్రచండ భానుడి ప్రతాపంతో ప్రజలు విలవిలల్లాడారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు చెట్ల నీడను, చల్లని ప్రదేశాలను ఆశ్రయించారు. నియోజకవర్గంలో బుధవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తాపం పెరగడంతో ప్రజలెవ్వరూ ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు సాహసించలేకపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వాహనదారులు ముఖాలకు క్లాత్ కట్టుకుని ప్రయాణించారు. వడగాల్పులు వీయడంతో పాటు ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు నరకం చూశారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. బయట పనులున్నా వాటిని త్వరిత గతిన పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

అంగట్లో అపాయం..!

- గ్రామాల్లో యథేచ్ఛగా గుట్కా అమ్మకాలు
- మత్తును సొత్తు చేసుకుంటున్న వ్యాపారులు
- కేసులు నమోదవుతున్నా వెనుకాడని వైనం
- లాభాలతో గుట్టుగా వ్యాపారం



పిఠాపురం: ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. కానీ ఆరోగ్యంతో పనిలేదంటూ గుట్కాలు, మత్తు పదార్థాలకు బానిసవుతున్నారు కొందరు యువత. దీనిని ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయల వ్యాపారం చాప కింద నీరులా సాగించేస్తున్నారు వ్యాపారులు. గుట్కా అమ్మకాలపై ప్రభుత్వం విధించిన నిషేధం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. వ్యాపారులు గుట్కాలకు కృత్రిమ కొరత సృష్టించి రేట్లు పెంచేస్తున్నారు. తద్వారా రూ.కోట్లు దిగమింగుతున్నారు తప్ప అమ్మకాలు మాత్రం ఎక్కడ ఆగలేదనేది జగమెరిగిన సత్యం. భారీగా లాభాలు వస్తుండడంతో వ్యాపారులు గుట్టుగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల పోలీసులు దాడులు ముమ్మరం చేసినా గ్రామాల్లో గుట్కా అమ్మకాలు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. యువత గుట్కాలకు అలవాటు పడుతుండడంతో వీటి అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయి.

అలవాటు పడితే అంతే సంగతి

ఆరోగ్యానికి హానికరమని తెలిసినా ఒకసారి అలవాటు పడిన వారు దానిని మానడం కష్ట సాధ్యం కావడంతో వాటికి బానిసలైపోతున్నారు. గుట్కాలకు అలవాటు పడిన వ్యక్తి ప్రతిరోజూ ఐదు నుంచి 20 ప్యాకెట్ల వరకూ వినియోగిస్తుంటారు. ఇలా సగటున రోజుకు జిల్లాలో లక్షలాది ప్యాకెట్లు వినియోగిస్తున్నట్లు అంచనా. వివిధ గుట్కాలకు మూడింతలకు పైగా రేట్లు పెంచి విక్రయిస్తున్నారు. అయినప్పటికీ అలవాటు పడిన వినియోగదారులు ఎంతో సొమ్మైనా వెనుకాడకుండా కొనుగోలు చేసి సేవిస్తున్నారు. మాములు వస్తువులు ధరలు పెరిగితే ఆందోళన వ్యక్తం చేసే వినియోగదారులు గుట్కాల రేట్లు పెరుగుదలను మాత్రం వ్యతిరేకించలేకపోతున్నారు. గుట్కాల సేవన అలవాటును మాన్పించడం ఒక్క కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే సాధ్యమని వైద్యులు చెబుతున్నారు.

మూడు పువ్వులు, ఆరు కాయలుగా వ్యాపారం

గత నెల రోజులుగా గుట్కాల రేట్లకు రెక్కలు వస్తున్నా వినియోగదారులు ఎవరూ నోరు మెదపకపోవడంతో సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గుట్కా వ్యాపారాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో గుట్కా వ్యాపారాలు సంబంధిత వ్యాపారులను కుబేరులను చేస్తున్నాయి. నూటికి 32 శాతం మంది ఈ గుట్కాలకు బానిసలవుతున్నట్లు సమాచారం. నిత్యం లక్షకు పైగా వివిధ రకాలు గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అంచనా.

దాడులు ముమ్మరం

గత కొన్ని రోజులుగా పోలీసులు గుట్కా అమ్మకాలపై దాడులు ముమ్మరం చేశారు. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల పరిధిలో దాడులు నిర్వహించిన పోలీసులు వేల సంఖ్యలో గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని 40 మందిపై కేసులు నమోదు చేశారు. అయితే దాడుల నేపథ్యంలో జాగ్రత్త పడ్డ వ్యాపారులు తిరిగి అమ్మకాలు ప్రారంభించారు.

విక్రయిస్తే కఠిన చర్యలు

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వాటి అమ్మకాలపై నిఘా పెట్టి దాడులు నిర్వహిస్తున్నాం. కొందరు పోలీసు సిబ్బందితో గుట్కా అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఎక్కడైనా గుట్కాలు అమ్ముతున్నట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. కొందరు వ్యక్తులు ఎక్కువ మొత్తంలో గుట్కాలు తెచ్చి గ్రామాల్లో చిన్న దుకాణాలకు వేస్తున్నట్లు సమాచారం ఉండడంతో ఈ తరహా వ్యాపారులపై ప్రత్యేక దృష్టి సారించాం.

వైఆర్‌కే శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

రక్తదానంతో ప్రాణదాతలు కండి

ఎమ్మెల్యే దొరబాబు



ఎఫ్‌కే పాలెంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: రక్తదానం చేయడం ద్వారా మరో వ్యక్తికి పునర్జన్మను ఇవ్వవచ్చని, యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పిలుపునిచ్చారు. పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం గ్రామ యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన రెడ్ క్రాస్ సహకారంతో చేయుత స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది అపోహల వల్ల రక్తదానం చేసేందుకు నిరాకరిస్తున్నారన్నారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర సమయాల్లో మనిషి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కరోనా సమయంలో యువత రోగులకు అనేక సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచులు ముమ్మిడి మహాలక్ష్మి, చింతల రావు, ఎంపీటీసీ అడపా రఘు, శ్రీపాద వల్లభ మహాసంస్థానం చైర్మన్ రెడ్డిం జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్య, క్రీడల్లో ‘ఉన్నత’ పాఠశాల



నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం, విద్యాకమిటీ, కౌన్సిలర్, ఉపాధ్యాయులు

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్య, క్రీడల పరంగా పట్టణ స్థాయిలో ఉన్నత స్థానంలో ఉందని ఆ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు అన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాలలో బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చందలాడ మాట్లాడుతూ ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకం అందజేస్తానని ఇచ్చిన మాట ప్రకారం ప్రథమ స్థానంలో నిలిచిన గణేష్‌కు రూ.రెండు వేలు, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన కిరణ్, ఏఎస్‌కె గాంధీలకు రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతిని అందజేశారు. వార్డు కౌన్సిలర్ బలుసు వాసు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో బచ్చుఫౌండేషన్ 10వ తరగతిలో ప్రథమ స్థానం, క్రీడలో అనేక బహుమతులు సాధించడంతో పాటు, యోగాలో అంతర్జాతీయ స్థాయికి పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. గణేష్‌కు పాఠశాల క్లాస్ టీచరు కె.అరుణ ఆమె తాతయ్య విశ్రాంత కమిషనర్ రాయన్న జ్ఞాపకార్థం రూ.వెయ్యి అందజేశారు. ఆయా సబ్జెక్టుల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి కారణమైన టీచర్లు వి.రాజు, జి.గోవిందు, కేవీవీ సత్యనారాయణ, కె.అరుణలను విద్యా కమిటీ, హెచ్ఎంలు శాలువా మెమోంటోలతో సత్కరించారు. పిజికల్ డైరెక్టరు తాళ్లూరి వైకుంతం, ఏఎల్‌పీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నైట్ హోటల్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం



సామర్లకోట రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో నైట్ హోటల్ వద్ద వినియోగదారుల తాకిడి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలోని ఏటీఎం సమీపంలో ఏర్పాటు చేసిన నైట్ హోటల్ తీవ్ర ట్రాఫిక్ అంతరాయానికి కారణమవుతోంది. సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు ఈ హోటల్ నిర్వహిస్తుండడం, స్టేషన్ సెంటర్‌లోని హోటళ్ల కంటే తక్కువ ధరలకు టిఫిన్లు లభించడంతో ప్రయాణికులు ఇక్కడే పార్శిల్ చేయించుకుంటున్నారు. దీంతో వినియోగదారుల గుంపులుగా ఉండడంతో రైల్వే స్టేషన్ లోనికి రాక పోకలు సాగించే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనిపై రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్‌ను వివరణ కోరగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే హోటల్ నిర్వాహకునిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లి ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన గోనిపాటి చిట్టిబాబు ఇంటికి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. ఆ పంటలు పక్కనే ఉన్న సిద్దాబత్తుల అప్పారావు ఇంటికి సైతం అంటుకున్నాయి. స్థానికులు, జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో చిట్టిబాబు ఇంటి నిర్మాణం కోసం దాచిన సుమారు రూ.3 లక్షల నగదు, రెండు కాసులన్నర బంగారం, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. కూతురు వివాహం కోసం అప్పారావు దాచిన రూ.3 లక్షలు, ఆరు కాసుల బంగారు వస్తువులు, నిత్యావసరాలు కాలిపోవడంతో రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని జగన్నాథపురంలో గతంలో తుని నియోజకవర్గానికి బీజేపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన వెలగా ఈశ్వరరావుతో పాటు మరో 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి దాడిశెట్టి రాజా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వెలగా ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే ఊపిరిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితమై వైఎస్సార్ సీపీలో చేరినట్టు తెలిపారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ చైర్మన్ గొర్లి రామ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ హరి

ప్రత్తిపాడు: రైతులు చిరుధాన్యాల సాగు చేపట్టేలా వ్యవసాయశాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీఏ) డీఆర్సీ హరి సూచించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ అనుబంధ శాఖల క్షేత్రస్థాయి సిబ్బందికి చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సామల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయన్నారు. చిరుధాన్యాల సాగులో మెళకువలను వివరించారు. జగ్గంపేట వ్యవసాయశాఖ ఏడీ యింటి వీర గంగాధర్, ఏడీఏ మాధవి, ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడు బాబ్జీని సత్కరిస్తున్న ఎంఈఓ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: సీఆర్పీగా విధులు నిర్వహిస్తూ 98 డీఎస్సీ ఉపాధ్యాయుడిగా విధులోకి చేరిన పసగడుగుల బాబ్జీని బుధవారం సత్కరించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్లు బాబ్జీని శాలువా, పూలమాలతో సత్కరించారు. విధి నిర్వహణలో బాబ్జీ సేవలు అభినందనీయమని ఎంఈఓ కొనియాడారు. పాతికేళ్ల క్రితం ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాలన్న కల ఎట్టకేలకు సాకారం కావడంతో విద్యార్థులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. సీఆర్పీ శేఖర్, కంప్యూటర్ సహాయకుడు కంపెంగ మణీష్, అకౌంటెంట్ లోవరాజు పాల్గొన్నారు.

ఇంటర్‌లో శ్రీదుర్గాహాసినికి మూడో ర్యాంకు



కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి గ్రామానికి చెందిన గోపు వీరశ్రీనివాస్, జ్యోతి దంపతుల కుమార్తె శ్రీదుర్గా హాసిని ఇంటర్మీడియెట్ ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 470కి 464 మార్కులు సాధించి స్టేట్‌లో మూడో ర్యాంక్ సాధించింది. జగపతినగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న శ్రీదుర్గా హాసిని గత నెలలో ఇంటర్ పరీక్షలు రాసింది. స్టేట్ మూడో స్థానం సాధించిన శ్రీదుర్గాహాసినిని కళాశాల యాజమాన్యం, గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

నేడు ఈ-ఆటోల ప్రారంభం

సామర్లకోట: క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రతి మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఈ-ఆటోలను గురువారం ప్రారంభించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మున్సిపాలిటీకి 8 ఈ-ఆటోలు మంజూరయ్యాయని, పారిశుధ్య ట్రాక్టర్లు వెళ్లడానికి అవకాశం లేని వార్డులకు ఈ ఆటోలను కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై ఈ వాహనాలను ప్రారంభించనున్నారు.

గ్రామ వలంటీర్ మృతి



లోవరాజు (ఫైల్)

అన్నవరం: స్థానిక నాలుగో వార్డు వలంటీర్ కక్కల లోవరాజు (30) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గత కొంత కాలంగా లోవరాజు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తీవ్ర గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అతడిని కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లోవరాజుకు ఇంకా పెళ్లి కాలేదు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి సత్యవతి దేవస్థానంలోని ప్రైవేట్ శానిటరీ ఏజెన్సీలో పనిచేస్తున్నారు. లోవరాజు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

తొండంగి: ఈ ఏడాది టెన్త్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహం అందించిందని ఎంఈవో షేక్‌బాబ్జీ బుధవారం తెలిపారు. మండలంలోని అద్దరిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చవాకుల కల్యాణి టెన్త్ పరీక్షల్లో 578 మార్కులతో జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికైందన్నారు. ఆమెను గురువారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అభినందిస్తారని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కిర్లంపూడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై రామకృష్ణ మూర్తి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట మండలం నరేంద్రపటణం గ్రామానికి చెందిన చిత్తరపు వెంకటేశ్వర్లు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ సంస్థలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఏలేశ్వరం మండలం తిరుమాలిలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లాల్సి ఉండగా రాజమహేంద్రవరం నుంచి మంగళవారం టీవీఎస్ ఎక్సెల్ బండిపై బయలు దేరాడు. సోమవరం గ్రామానికి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలపాలయ్యాడు. హైవే సిబ్బంది అతడిని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గోకవరం: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఎ.జయానంద్, వై.మహేష్ ప్రయాణిస్తున్న బైక్, కామరాజుపేటకు చెందిన ఎం.వాసు ప్రయాణిస్తున్న బైక్ బుధవారం కొత్తపల్లి శివారున ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వీరిని స్థానికులు గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సమాజానికి దిక్సూచి జోతిష్యం

- జోతిష్య పండితుడు సరిపెల్ల
- కాకినాడలో అంతర్జాతీయ సదస్సు



డాక్టర్ సరిపెల్లను సత్కరిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: సమాజానికి జోతిష్యం దిక్సూచి వంటిదని, దీనిని అధికారికంగా ప్రామాణిక శాస్త్రంగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ అంతర్జాతీయ జ్యోతిష్య సదస్సు తీర్మానించింది. ప్రముఖ జోతిష్యపండితులు సరిపెల్ల శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో కాకినాడలో బుధవారం అంతర్జాతీయ జోతిష్య సదస్సు జరిగింది. సైన్స్, సైకాలజీ కోర్సులలానే జోతిష్యాన్ని కూడా పాఠ్యాంశాల్లో మరింతగా అభివృద్ధి చేయాలని జ్యోతిష్య పండితులు కోరారు. ఈ సందర్భంగా పరాశర అకాడమీ ఆఫ్ ఆస్ట్రాలాజికల్ సైన్సెస్ అధిపతి నాగులపల్లి మహేష్ చందర్ భరద్వాజ్ మాట్లాడుతూ జోతిష్యం విజ్ఞానశాస్త్రమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ప్రభుత్వాలు ఈ శాస్త్రాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. పంచాగకర్త, జోతిష్యవాస్తు ముహూర్త పండితులు డాక్టర్ సరిపెల్ల శ్రీచంద్రమూర్తికి మహామహోపాధ్యాయ పురస్కారం అందించి సత్కరించారు. వింజవరపు జనార్దన్, దీక్షితుల సుబ్రహ్మణ్యం, మేడవరపు సంపత్‌కుమార్, మద్దాలి శ్రీనివాసరావు, చల్లా నిరంజన్ పాల్గొన్నారు.

వాహన ప్రమాణాలు పాటించాల్సిందే



విద్యా సంస్థల వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎంవీఐ సురేష్

పెద్దాపురం: ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తమ వాహనాల ప్రమాణాలు తప్పక పాటించాలని పెద్దాపురం రవాణా శాఖాధికారి ఎంవీఐ ఆర్.సురేష్ సూచించారు. పెద్దాపురం రవాణా కార్యాలయం పరిధిలో ఆయా ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులను బుధవారం ఆయన పరిశీలించారు. విద్యా సంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ ఎంతో అవసరమని, నింబంధనలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని యాజమాన్యాలను ఆయన హెచ్చరించారు. పెద్దాపురం రవాణా శాఖ పరిధిలో కిర్లంపూడి, ఏలేశ్వరం, జగ్గంపేట, గండేపల్లి, పెద్దాపురం మండలాల పరిధిలో ఆయా విద్యా సంస్థలకు సంబంధించి సుమారు 141 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 89 బస్సులను పరిశీలించగా వాటిలో మరో 52 బస్సులకు ఫిట్‌నెస్ ఇవ్వలేదని ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు తప్పకుండా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను తీసుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని ఎంవీఐ సూచించారు.

సేవా సైనికులకు సత్కారం



వలంటీర్‌ను సత్కరిస్తున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: మండలంలోని గుడివాడ గ్రామంలో బుధవారం సర్పంచ్ కనపర్తి సీమదొర అధ్యక్షతన వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతు వలంటీర్లు ప్రజలకు మరింత చేరువలో సేవలందించాలని దొరబాబు సూచించారు. అనంతరం ఎంపీపీ పెంకే సత్యవతి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు యినకొండ వీర విష్ణుచక్రం, వైఎస్సార్ సీపీ మండల యూత్ మాజీ అధ్యక్షులు గోపు మురళి, నాగబోయిన రాజుబాబులతో కలిసి గుడివాడ, సిరివాడ వలంటీర్లు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఎ.భారతి, కనపర్తి బాబి, మద్దూరి వెంకటేశ్వర రావు, కనపర్తి శ్రీనివాస్, గోపి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.28.33 లక్షలు



అధికారుల సమక్షంలో హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: స్వయంభూ తిరుపతి శృంగార వల్లభుడి ఆలయానికి హుండీల ద్వారా 28,32,802 రూపాయల ఆదాయం సమకూరినట్లు దేవదాయ శాఖ డీఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. ఆ శాఖ తనిఖీ అధికారిగా ఎంఎస్ఎన్ చారిటీస్ ఏసీ పి.బాబురావు పర్యవేక్షణలో బుధవారం ఆలయ హుండీలను లెక్కించారు. ఈఓ నారాయణమూర్తి మాట్లాడుతూ 78 రోజులకు హుండీల ద్వారా రూ.22,11,227, అన్నదానం హుండీల ద్వారా రూ.06,21,575 వెరసి రూ.28,32,802 ఆదాయం సమకూరిందన్నారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, కుంచే వెంకన్నతో పాటు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు (చిన్నా), ఆలయ సిబ్బంది, కాండ్రకోట గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మాధురి, సిబ్బంది, సేవా సమితి, భక్త మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రామాలయం అభివృద్ధికి కృషి

పెద్దాపురం: మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో రామాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గ్రామంలో టీటీడీ నిధులు సుమారు 10 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన బుధవారం భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులకు సూచించారు. గోపు మురళి, నాగబోయిన రాజుబాబు, కుండల ప్రసాద్, నల్లల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం



నాగలక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

పెద్దాపురం: కష్టాల్లో ఉన్న కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. భర్త చనిపోయి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఆమెకు ఆర్థిక భరోసా కల్పించారు మండలంలోని ఆర్‌బీ కొత్తూరుకు చెందిన 2003 పదో తరగతి బ్యాచ్. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కాదేటి నాగలక్ష్మి భర్త ఇటీవలే మృతి చెందారు. వికలాంగురాలైన ఆమెకు 2003 బ్యాచ్ తోటి స్నేహితులు సిద్దు, నరేష్, వరాలరావు, శివకృష్ణ అండగా నిలిచారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యండ్రు రామారావు చేతుల మీదుగా వారంతా కలిసి సుమారు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు.